క్లుప్తంగా

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సాలూరు: సంక్రాంతి పండుగ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో ప్రజారోగ్య, ప్రజా రోగ్యేతర, పారిశుద్ధ్య సిబ్బందికి మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ, ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, తదితరులు ఉన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న కార్యదర్శి మురళి

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో శుక్రవారం దోమలు నివారించడానికి మందును పిచికారీ చేసినట్లు కార్యదర్శి మురళి తెలియజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో కాలువల్లో పూడిక తీయించి, వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు.

నీటికుంటల పరిశీలన



నీటి కుంటలను పరిశీలిస్తున్న అధికారులు

మక్కువ: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన నీటి కుంటలను ఆ శాఖ డీహెచ్‌ఓ సత్యనారాయణ రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. మార్కొండపుట్టి పంచాయతీ పరిధిలోని పెద్ద గయులు మూకవలస, మార్కొండపుట్టిలలో నిర్మించిన నీటి కుంటలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఓ పప్పు భాను క్రాంతికుమార్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఐటీఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణ

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ టీవీగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ హబ్ ఇనిషియేటివ్ ప్రోగ్రాం ద్వారా ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్లంబింగ్ జనరల్ అసిస్టెంట్ కోర్సు, ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్ కోర్సులో ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడాటాతో పాటుగా విద్యార్హత ధ్రువపత్రాలు, 2 పాస్ ఫొటోలు, బ్యాంకు అక్కౌంట్ జిరాక్స్‌లతో అప్లై చేయాలన్నారు. వివరాలకు 9848438254 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

మట్టి కుండలు, గుమ్మడి కాయలకు గిరాకీ

గరుగుబిల్లి: మండలంలో గుమ్మడి కాయలకు పండగ గిరాకీ నెలకొంది. సంక్రాంతి పండగలో గుమ్మడికాయ భాగం కావడంతో వీటి ధరలకు రెక్కలొచ్చాయి. నిన్న మొన్నటి వరకు రూ.200లోపు ధర పలికే గుమ్మడికాయలు శనివారం నాటికి రూ.350 పైన ధరలు పలుకుతున్నాయి. పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, కూనేరు తదితర ప్రాంతాల సంతల నుంచి తెచ్చి మండలంలోని పలు గ్రామాలలో గుమ్మడికాయలు గత వారం రోజులుగా వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. స్థానికంగా రైతులు ఈ పంటను సాగు చేయకపోవడంతో వ్యాపారులు చెప్పిందే అన్నట్టు విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులంటున్నారు.

నాటు కోళ్లకు గిరాకీ..

నాటు కోళ్లకు పండగ గిరాకీ తగిలింది. సంక్రాంతి పండగలో మూడో రోజు జరుపుకునే కనుమ పండగలో నాటు కోడి ప్రాధాన్యత సంతరించుకోవడంతో వీటికి డిమాండ్ ఏర్పడింది. దీంతో నిన్న మొన్నటి వరకు కిలో నాటు కోడి రూ.650 పలికిన కోడి ఇప్పుడు రూ.800ల నుండి రూ.900ల వరకు ధర పలుకుతోంది. మండలంలోని పలు గ్రామాలలో నాటుకోళ్ల పెంపకం వృత్తిగా చేపట్టకపోవడంతో ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో ధరలు అధికంగా పెరిగాయని స్థానికులు పేర్కొంటున్నారు.

మట్టి కుండలకు..

పాలకొండ రూరల్: సంక్రాంతి నేపథ్యంలో పెద్దలకు పొత్తర్లు, పిండి వంటలు, ప్రసాదాలు వండి పెట్టేందుకు సాంప్రదాయానికి పెద్దపీట వేస్తూ మట్టి కుండలను వినియోగించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో పండగ పూట మట్టి కుండలకు భలే గిరాకీ ఏర్పడింది. మండలంలో తుమరాడ గ్రామంలో కుమ్మర్లు తయారు చేసిన కుండలను ప్రత్యేకం. మట్టి పాత్రల తయారీదారులు వాహనాల్లో వీటిని తీసుకువచ్చి వీధి కూడళ్ల వద్ద, ప్రధాన మార్కెట్‌లో అమ్మకం కోసం తెచ్చిపెట్టారు.

మార్కెట్‌కు సంక్రాంతి సందడి

- ఆఫర్‌లతో జోరందుకున్న వస్త్రవ్యాపారం
- బిజీగా ఫుట్‌పాత్ విక్రయాలు



రహదారులపై కిక్కిరిసిన జనాలు

పార్వతీపురం/పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణ మెయిన్ రోడ్డంతా సందడిగా మారింది. రోడ్లన్నీ జనాలు, వాహనాలతో నిండిపోతున్నాయి. సంక్రాంతి సమీపిస్తుండడంతో పండగ షాపింగ్ చేసేందుకు ప్రజలు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఈ ఏడాది రైతులకు ధాన్యం నగదు కూడా వారి బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో మార్కెట్ కళకళలాడుతోంది. వస్త్ర దుకాణాలు, షాపింగ్‌మాల్స్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల షోరూమ్‌లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. పట్టణంలో ఇసుకేస్తే రాలనంత జనంతో ప్రధాన రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు షాపింగ్ మాల్స్ రద్దీగా కనిపిస్తున్నాయి. కొన్ని దుకాణాల్లో అయితే లైన్లలో నిలబడి తమ షాపింగ్ వంతు ఎప్పుడొస్తుందా అని ఎదురు చూసే పరిస్థితి నెలకొంది.

ఆఫర్ల జోరుతో..ఆకర్షణ మంత్రం

పండగంటే ఆఫర్లు..ఆఫర్లుంటేనే ఆకర్షణ..ఇదే మంత్రాన్ని దాదాపు అన్ని వస్త్ర దుకాణాలు పాటిస్తున్నాయి. దీంతో చుట్టుపక్కల గ్రామాలనుంచి వచ్చిన ప్రజలు వస్త్రాలు, ఇతర బంగారు ఆభరణాలు, కిరాణా సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది పండగ షాపింగ్ నాలుగు రోజులనుంచి భారీగా జరుగుతోంది. పట్టణంలో షాపింగ్ మాల్స్, పెద్ద వస్త్ర దుకాణాలు 80 వరకూ ఉండగా, చిన్న వస్త్ర దుకాణాలు వందల్లో ఉంటాయి. సాధారణ రోజుల్లో ప్రతిరోజూ రూ.8కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకూ, వీకెండ్‌లో రూ.15 కోట్ల వరకూ వ్యాపారం జరిగేది. నాలుగైదు రోజులుగా రోజుకు రూ.20 కోట్ల వరకూ కొనుగోళ్లు జరుగుతున్నాయని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి.

ఆన్‌లైన్‌లోనూ విరివిగా కొనుగోలు

ఆన్‌లైన్ షాపింగ్ లోనూ ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. దుకాణాల రద్దీ చూసి కొందరు ఆన్‌లైన్ షాపింగ్‌పై ఆసక్తి చూపుతున్నారు. వన్ డే డెలివరీ ఆఫర్ ప్రకటించడంతో ఇందులో షాపింగ్ చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆన్‌లైన్‌లో స్మార్ట్ ఫోన్లు, మొబైల్ యాక్సెసరీస్, ఎలక్ట్రానిక్ పరికరాలు 60 శాతం, కిచెన్‌కు సంబంధించి 20 శాతం, వస్త్రాలు 10 శాతం వరకు కొనుగోలు జరుగుతున్నట్లు ఆయా సంస్థలు పేర్కొంటున్నాయి.

రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిట

సెలవుల సందర్భంగా సొంతూళ్లకు పయనమయ్యే వారితో బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. రైలు ఎక్కేందుకు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రిజర్వేషన్ బోగీలు కూడా ప్రయాణికులతో నిండిపోతున్నాయి. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నా రద్దీ ఎక్కువగానే ఉంది.

జోరందుకున్న ఫుట్‌పాత్ వ్యాపారం

సంక్రాంతి పండగ నేపథ్యంలో పట్టణంలో ఫుట్‌పాత్ వ్యాపారం జోరందుకుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్ర వస్త్ర వ్యాపారులు కూడా రావడంతో పట్టణంలోని ఫుట్‌పాత్‌లు వస్త్ర దుకాణాలతో కళకళలాడుతున్నాయి. వివిధ మిల్లుల్లో తయారైన రెడీమేడ్ వస్త్రాలను దిగుమతి చేసి ఇక్కడ విక్రయిస్తున్నారు. ఫుట్‌పాత్‌లతోపాటు పట్టణ శివారులో రోడ్డుకు ఇరువైపులా టెంట్లు వేసి కొంతమంది విక్రయిస్తుంటే మరికొంతమంది మొబైల్ వ్యాన్‌లలో విక్రయిస్తున్నారు. గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాల వ్యాపారులతోపాటు మహారాష్ట్ర రాజస్థాన్, కర్ణాటక ప్రాంతాల వలస వ్యాపారులు సైతం అనేక మిల్లుల్లో తయారు చేసిన రెడీమేడ్ దుస్తులను ఫుట్‌పాత్ దుకాణాల్లో అందుబాటులో ఉంచుతున్నారు. టీషర్టులు, కాటన్ ఫ్యాంట్లు, చుడీదార్‌లు, టాప్‌లు, పిల్లలకు అందరికీ అవసరమైన అనేక రకాల రెడీమేడ్ దుస్తులతో పాటు దుప్పట్లు, ఉలెన్ రగ్గులు విక్రయిస్తున్నారు.



సందడిగా ఉన్న ఫుట్‌పాత్ వస్త్ర వ్యాపారం



పార్వతీపురం టౌన్: భోగి పళ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు



పార్వతీపురం టౌన్: భోగి మంటకు దుంగలు తీసుకు వెళ్తున్న దృశ్యం



పార్వతీపురం టౌన్: చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు



పార్వతీపురం టౌన్: రద్దీగా ప్రధాన రహదారి

సమగ్ర ప్రణాళిక ప్రధానం

- వార్షిక విద్యా ప్రణాళిక తయారీకి కసరత్తు



బలిజిపేట ఉన్నత పాఠశాల

బలిజిపేట: రానున్న విద్యా సంవత్సరానికి అవసరమైన నిధులు సమకూర్చుకు నేందుకు ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సమగ్ర శిక్ష పరిధిలోని కేజీబీవీలు, ఇతర సెక్టోరియల్ విభాగాలతో పాటు పాఠశాల స్థాయిలో అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు తయారుచేసే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. మండలస్థాయి నుంచి పాఠశాలల్లో ప్రణాళికలు తయారుచేసి జిల్లాస్థాయికి పంపిస్తారు. అక్కడి నుంచి రాష్ట్రస్థాయికి ప్రణాళికలు పంపిస్తారు. ప్రణాళిక సలహా సంస్థ ఆమోదంతో నిధులు ఖరారు కానున్నాయి. వాటి ఆధారంగానే పాఠశాలలకు నిధులు కేటాయిస్తారు. 2023–24విద్యా సంవత్సరంలో గణనీయమైన నిధులు రాబట్టేందుకు విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

మైక్రో లెవెల్ ప్లానింగ్‌తో ముందుకు

రాష్ట్రస్థాయి నుంచి పాఠశాల అవసరాలు గుర్తించకుండా, పాఠశాలస్థాయి నుంచి గుర్తించాలనేది మైక్రో లెవెల్ ప్లానింగ్ ముఖ్య ఉద్దేశం. యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(యూ–డైస్)ను ప్రాతిపదికగా తీసుకుని పాఠశాలస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గత సంవత్సరం ఏడబ్ల్యూపీ అండ్ బీ(యాన్యువల్ వర్క్‌ప్లాన్ అండ్ బడ్జెట్)ను తయారుచేశారు. నూతన జాతీయ విద్యావిధానం–2020 నిబంధనల మేరకు ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు ఆరు విభాగాలుగా పాఠశాలలను వర్గీకరించారు. గతంలో సర్వశిక్ష, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ వేర్వేరుగా ప్రణాళికలు రూపకల్పన చేసేవి. ప్రస్తుతం వాటిని ఒకే గొడుగు కిందకు తెస్తూ సమగ్ర శిక్షగా పేరు మార్చి ప్రణాళిక రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. ఇందులో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులే కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ప్రణాళిక రూపకల్పనపై షెడ్యూల్:

మండలస్థాయిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ అధ్యక్షతన ప్రణాళికల నిమిత్తం సమావేశం నిర్వహించారు. ఆ తరువాత అన్ని స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలలు, పాఠశాలల స్థాయిలో ప్రణాళికలు తయారుచేసుకోవాలి. దీనిలో 7వ తేదీన స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో, 8,9తేదీలలో ఆవాస ప్రాంత పరిధిలో గ్రామసభ, 10వ తేదీన పాఠశాల అభివృద్ధి ప్రణాళికను తయారుచేశాం. 11వ తేదీన ఆవాసప్రాంత ప్రణాళికను గ్రామ సర్పంచ్‌తో ధ్రువీకరించి , 12వ తేదీన స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడితో ధ్రువీకరణ, చివరగా 18,19తేదీలలో మండలస్థాయి ప్రణాళికను మండల కోర్ టీంతో చర్చించి ఆమోదం తెలపాలి.

క్రీడాపోటీల నిర్వహణ అభినందనీయం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని మండలంలోని ఎల్వీఆర్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు కె.అరవింద్ కుమార్ ఆధ్వర్యంలో క్రీడల పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రశంసించారు. ఈ మేరకు శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతుల ప్రదానం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జోగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విజేతలను అభినందిస్తూ ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతిగా వాలీబాల్ కిట్లు ప్రదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి అనేక అభివృద్ధి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యవస్థాపకులను మెచ్చుకుంటూ భవిష్యత్తులో ఇంకెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజానికి, యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, సర్పంచ్ జె.తేరేజమ్మ, ఎం.వెంకటరమణ, అప్పారావు, ఎస్.హరిగోపాలరావు, ఎస్.ప్రసాద్, ఎస్.కిరణ్‌కుమార్, క్రీడాకారులు, మండల, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఎల్వీర్ సేవాసంస్థ వ్యవస్థాపకుడు అరవింద్‌కుమార్, క్రీడాకారులు శాలువాతో సత్కరించారు.

• అభినందనలు



చిన్నమ్మలును అభినందిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: నవజీవన్ ట్రస్ట్ నిర్వాహకులు చిక్కాల చిన్నమ్మలు, స్వాతిశ్రీలకు గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు శుక్రవారం ఆత్మీయసన్మానం చేశారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర స్వగృహంలో రాజన్నదొర చేతుల మీదుగా సత్కార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రమణమూర్తి, దాలినాయుడు, బ్రహ్మాజీ, మల్లేశ్వరరావు, చక్రి, తదితరులు ఉన్నారు.

కొనుగోలు లక్ష్యాలు పూర్తి చేయాలి

భామిని: మండలంలోని ధాన్యం కొనుగోలు లక్ష్యాలను ఆర్‌బీకేల ద్వారా చేపట్టాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తోట సింహాచలం, తహసీల్దార్ నీలాపు అప్పారావు అన్నారు. భామిని రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం అధ్యక్షతన శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా సంఘ సమావేశంలో మాట్లాడారు. మండలంలో ధాన్యం సేకరణకు 16,800 మెట్రిక్ టన్నుల లక్ష్యం కాగా ఇప్పటికే 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు ఎంఏఓ వివరించారు. మిగతా ధాన్యం సేకరణకు 3వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ఉన్నతాధికారుల అనుమతి సాధించాలని సభ్యులు కోరారు. వీఆర్‌ఓల సహాయంతో ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. వ్యవసాయ సహాయకులు, రైతు సంఘ సభ్యులున్నారు.

సురక్షిత ప్రయాణం చేయండి



ఎస్‌ఐ హరికృష్ణ

వీరఘట్టం: సంక్రాంతి పర్వదినం సందర్భంగా స్వగ్రామాలకు వచ్చే వారు సురక్షిత ప్రయాణాలు చేయాలని ఎస్‌ఐ ఎం.హరికృష్ణ సూచించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పరిమిత వేగంతో ప్రయాణాలు చేసి తిరుగు ప్రయాణంలో కూడా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని వాహనదారులకు సూచించారు. ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ప్రమాదాల వల్ల కలిగే అనర్థాలను గుర్తించి వాహనదారులు, ప్రజలు తెలుసుకోవాలన్నారు.

సంక్రాంతికి ఊర్లు వెళ్లేవారు తస్మాత్..

సీతంపేట: సంక్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు ఇళ్లలో విలువైన ఆభరణాలు విడిచి వెళ్లవద్దని సీతంపేట, దోనుబాయి ఎస్‌ఐలు ఎ.నీలకంఠరావు, కిషోర్‌వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అలాగే రహదారులపై వాహనాలు డ్రైవింగ్ చేసే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించడం, పరిధికి మించి ప్రయాణించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కోడిపందాలు, పేకాట వంటివి ఆడరాదన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



కారు ఢీకొనడంతో ఒరిగి పోయిన విద్యుత్ స్తంభం

కురుపాం: కురుపాం శివారులో గల మంతిన చెరువు గట్టుపై బీటీ రహదారికి ఎడమ వైపు ఉన్న విద్యుత్ స్తంభాన్ని షిఫ్ట్ డిజైర్ కారు వేగంగా ఢీకొనడంతో పూర్తిగా ఒరిగిపోయింది. కురుపాం సబ్‌స్టేషన్ నుంచి గ్రామంలోనికి విద్యుత్ సరఫరా చేసే 33 కేవీ లైన్ కావటంతో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. తక్షణమే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు స్తంభాన్ని మార్చారు.

పేదలందరికీ సొంత గూడు



లాటరీ విధానంలో లబ్ధిదారుల స్థలాలను ఎంపిక చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పథకాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా ఇల్లు లేని పేదవారెవరు ఉండరాదనే సంకల్పంతో అందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు చేసి వారి సొంతింటి కలను సాకారం చేస్తోందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పార్వతీపురం పురపాలక సంఘంలో ఇప్పటికే సుమారు 3,100 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు గతంలో మంజూరు చేశారు. అయితే అందులో కొంతమంది ప్లాట్ల రీసైజింగ్‌లో స్థలాలు కోల్పోయారు. ఇటీవల మొత్తం 14 సచివాలయాల పరిధిలో గల 28 వార్డులలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇళ్లకోసం కొంతమంది అర్జీ పెట్టుకున్నారు. వారందరికీ పురపాలక సంఘంలో శుక్రవారం నిర్వహించిన లాటరీ పద్ధతిలో ఇళ్ల స్థలాల పంపిణీ చేపట్టారు. ఈ లాటరీ పద్ధతిలో లబ్ధిదారులు ఎవరి చీటీ వారే తీసుకోగా అందులో వచ్చిన నంబర్ స్థలాన్ని వారికి కేటాయించారు. ఈ లబ్ధిదారులందరికీ వెంకంపేట రెవెన్యూ పరిధిలో ఉన్న జగనన్న లేఔట్‌లో స్థలాలు కేటాయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ అందరి జీవిత కాల ఆశయాన్ని నెరవేర్చిన ప్రభుత్వం మనదని, ఇళ్ల స్థలాలు వచ్చిన ప్రతి ఒక్కరూ తప్పక ఇంటి నిర్మాణం సకాలంలో మొదలు పెట్టి పూర్తి చేసుకుని ప్రభుత్వ ఆశయం పూర్తిస్థాయిలో నెరవేరేలా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్‌చైర్మన్ ఇండుపూరు గున్నేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు, తహసీల్దార్ శివన్నారాయణ, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, లబ్ధిదారులు, మున్సిపల్ సచివాలయాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పందాలు వద్దు.. సంప్రదాయ క్రీడలే ముద్దు

- ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ



ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: సంక్రాంతి పండగ నేపథ్యంలో కోడి, గొర్రె పందాలు వద్దని సంప్రదాయ క్రీడలే ముద్దని ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో తెలుగుదనం ఉట్టిపడేలా గ్రామాల్లోని యువతీ యువకులు రంగవల్లులు, కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడా పోటీలు నిర్వహించుకోవాలే తప్ప పేకాట, కోడి, గొర్రె పందాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్కిల్ పరిధిలోని ఎల్విన్‌పేట, నీలకంఠాపురం, కురుపాం పోలీస్‌స్టేషన్ల పరిధిలో తమ సిబ్బందితో గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, కోడి, గొర్రె పందాలు, పేకాట నిర్వహించకూడదని గ్రామాల్లో తమ సిబ్బందిచే సూచనలు జారీ చేయడం జరిగిందన్నారు. ఏ గ్రామ పరిధిలోనైనా ఇటువంటి పందాలకు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పండగ సరదాల పేరుతో వాహనాలను పరిమితికి మించిన వేగంతో నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, పట్టుబడితే చర్యలు కఠినతరంగా ఉంటాయని సీఐ హెచ్చరించారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం



ఉల్లిభద్రలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

- డీఐఓ జగన్మోహనరావు

గరుగుబిల్లి: పరిసరాలను పరిశుభ్రతతో అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో ఎర్రన్నగుడి జంక్షన్‌లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. లేకుంటే అవి దోమలకు ఆవాసాలుగా మారి వివిధ రకాల జ్వరాలకు కారణమవుతాయని, ఉపయోగంలో లేని రుబ్బురోళ్లు, కొబ్బరిటెంకలు, పాడైన ప్లాస్టిక్ వస్తువులు, సీసాలు, టైర్లు మొదలగు వాటిలో నిల్వ నీటిని లేకుండా జాగ్రత్త పడాలన్నారు. వాటిని ఇంటి ఆవాసాలలో లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి షాపు వద్ద విధిగా చెత్త బుట్టలు ఉంచాలని, పరిసరాల్లో చెత్త వేయకుండా చూసుకోవాలని షాపు యజమానులకు సూచించారు. అనంతరం వైద్య సిబ్బంది నిర్వహించిన ఫ్రై డే – డ్రై డే ర్యాలీలో పాల్గొన్నారు. ఎప్పటికప్పుడు ఈ ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సర్పంచ్ ఎస్.దివ్యలక్ష్మి, సెక్రటరీ పెదకోటేశ్వరరావు, సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భోగి పండగకు ఆ రెండు గ్రామాలు దూరం

భామిని: సంక్రాంతి అనగానే ముందుగా వచ్చే భోగి పండగకు విశేష ప్రాధాన్యం. ఊరి చివర కలప దుంగలు, పాత వస్తువులతో వేసే భోగి మంటలకు పిల్లలు తెచ్చే భోగి పిడకల దండలు తోడు కావడంతో రోజంతా భోగి మంట కొనసాగుతుంది. తలంటి స్నానాలు, కొత్త బట్టలు ధరించి భోగి పిడకల దండలను మంటలలో వేయడంలో పిల్లల సందడి చెప్పనలవికానిది. కానీ భామిని మండలంలోని రెండు గ్రామాలు భోగి పండక్కి దూరంగా ఉంటాయి. సింగిడి(ఎస్), గురండి(ఎస్) గ్రామాల్లో దశాబ్దాలుగా భోగి మంటలను వేయడం లేదు. అది ఆయా గ్రామాల వారి ఆచారంగా కొనసాగుతోంది. పర్లాకిమిడి, జయపూర్ జమిందార్ల శాసనం గ్రామాలుగా గుర్తింపు పొందిన, బ్రాహ్మణులకు కేటాయింపు గ్రామాలుగా ఉన్న సింగిడి, గురండి గ్రామాల్లో భోగి మంటలు ఎప్పుడూ వేయరు. ఇదే ఆచారాన్ని ప్రస్తుత తరం వారు కూడా కొనసాగిస్తున్నారు.